

19న చేనేత కార్మికుల ధర్నా

ఏలూరు : రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి చేనేత ఐక్య కార్యాచరణ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని చేనేత కార్మిక సంఘం (ఎఐటియుసి), ఎపి చేనేత కార్మిక సంఘం (సిఐటియు) పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా ఏలూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా నాయకులు కడుపు కన్నయ్య, పిచ్చుక ఆదిశేషు మాట్లాడారు. కన్నయ్య మాట్లాడుతూ మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి నేతన్న నేస్తం పథకం వర్తింపజేయాలని, చేనేతకు మరణ శాసనమైన జిఎస్‌టిని వెంటనే రద్దు చేయాలని, చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలుపరచాలని డిమాండ్ చేశారు. పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ మాస్టర్ వీవర్స్ వద్ద చేనేత సహకార సంఘాల వద్ద నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

పథకాలు భళా.. నాణ్యత డొల్ల..!

నాశిరకంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు అందించే ఆహార పదార్థాలు

వేరుశనగ చిక్కీలు, ఖర్జురం, బెల్లంలో పురుగులు

చోడిపిండిలో ఇసుక, ముక్కినవాసనతో గోధుమ పిండి

మొదటివారంలో ఇవ్వాల్సి పాలు నెలఖారున అందజేత

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాలపై కొరవడిన పర్యవేక్షణ

కాంట్రాక్టర్ల వ్యవహార శైలిపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో అంగన్‌వాడీకేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్స్‌లోని ఆహార పదార్థాల నాణ్యత లేకపోవడంపై తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఏదో ఇస్తునామన్న పేరుకే తప్ప గర్భిణులకు ఇచ్చే పోషకాహారంపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందని చెబుతున్నారు. కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ఏలూరు జిల్లాలో తొమ్మిది ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,289 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1626 కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఏలూరు జిల్లాలో ఎనిమిది వేల మంది వరకూ గర్భిణులు, బాలింతలు, పశ్చిమలోనూ వేలల్లో గర్భిణులు, బాలింతలున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలను అమలుచేస్తోంది. గర్భం దాల్చిన మూడు నెలల నుంచి బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల వరకూ ఈ పథకం వర్తిస్తుంది. పుట్టే బిడ్డ ఆరోగ్యకరంగా పెరగాలన్న లక్ష్యంతో సంపూర్ణ పోషణ పథకం అమలు జరుగుతోంది. గర్భిణులకు, బాలింతలకు నిత్యం వండిన సంపూర్ణ ఆహారంతోపాటు, 200 మిల్లీలీటర్ల పాలు, ఉడికించిన గుడ్డు అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తారు. టేక్ హోం రేషన్ కింద వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్‌ను అందిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలకు టెట్రా మిల్క్ పాలు అందిస్తున్నారు. ఈ పాలు నిబంధనల ప్రకారం మొదటివారంలో కేంద్రాలకు చేరాలి. నిత్యం పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంతోపాటు, పాలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ పాలు ఈ నెలఖారున 29, 30 తేదీల్లో ఇస్తున్నారు. దీంతో నిత్యం గర్భిణులకు, బాలింతలకు పాలు అందడం లేదు. గుడ్డు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. నిబంధనల ప్రకారం గుడ్డు 50 గ్రాములు ఉండాలి. కాంట్రాక్టర్లు 25 గ్రాముల బరువుగల గుడ్లను సరఫరా చేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయాడు. కొన్నిసార్లు పాడైన గుడ్లు సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులెవ్వరూ పట్టించుకున్న పరిస్థితి లేదు. పోషకాహారంలో భాగంగా అందించే వస్తువుల నాణ్యతపై అంగన్‌వాడీ ఉద్యోగులు నెత్తీనోరు బాదుకుంటున్నప్పటికీ పరిస్థితిలో మాత్రం మార్పు రావడంలేదని తెలుస్తోంది.

నాణ్యతలేని వైఎస్ఆర్ సంపూర్ణ పోషక ప్లస్ కిట్స్

గర్భిణులకు, బాలింతలకు ఇంటికి పోషకాహారం అందించడంలో భాగంగా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లను ప్రభుత్వం అందిస్తోంది. ఈ కిట్లలో ఐదు రకాల ఆహార పదార్థాలను ఇస్తున్నారు. మల్టీగ్రైన్ గోధుమపిండి రెండు కిలోలు, బెల్లం అరకేజి, వేరుశెనగ చిక్కీలు అరకేజి, ఎండుఖర్జూరం అరకేజీ, రాగి పిండి అరకేజి ఇస్తున్నారు. వీటిలో ఏ ఒక్క ఆహార పదార్థంలోనూ నాణ్యత ఉండటంక లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. వేరుశెనగ చిక్కీల్లో, ఎండు ఖర్జూరంలో పురుగులుంటున్నాయి. రాగిపిండిలో ఇసుక ఎక్కువగా ఉండటంతో తినలేకపోతున్నామని చెబుతున్నారు. గోధుమ పిండి ముక్కినవాసన రావడం, బెల్లం పులుపుగా ఉండి, పురుగులుంటున్నాయని పలువురు వాపోతున్నారు. ఏ ఒక్క ఆహార పదార్థం కూడా నాణ్యత లేకపోవడంతో పట్టుకెళ్లిన కిట్లను వాడకుండాక పడేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా, ప్రజాధనం వృథా అవుతోంది. ఇంత పెద్దమొత్తంలో నిధులు ఖర్చుచేసి అందిస్తున్న పోషకాహారంపై కనీస పర్యవేక్షణ లేకపోవడం ఏమిటో ఏ ఒక్కరికీ అర్థంకావడం లేదు. కాంట్రాక్టర్లు రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం, జిల్లా అధికారులు గర్భిణులకు, బాలింతలకు ఇచ్చే పోషకాహారంపై దృష్టిసారించాలని అంతాకోరుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

'పోలవరం'పై దుష్ప్రచారాలు మానుకోండి

కుంగిన గైడ్‌బండ్‌కు తాత్కాలిక మరమ్మతులు

కారణాల గుర్తింపునకు నిజనిర్ధారణ కమిటీ చర్యలు

పోలవరం ప్రాజెక్టు పరిశీలనలో మంత్రి అంబటి

ప్రజాశక్తి - పోలవరం

గైడ్ బండ్ కుంగడం సాంకేతికలోపమని, త్వరితగతిన దీన్నిసరిచేసే పనులు వేగవంతం చేస్తామని రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన ఆయన తొలుత ప్రాజెక్టులో డయా ఫ్రమ్ వాల్ ప్రాంతంలో అగాధాలు పూడ్చివేత పనులు, వైబ్రో కాంపెక్షన్ పనులను పరిశీలించారు. అనంతరం ఇటీవల గైడ్‌బండ్ కుంగిన ప్రాంతంలో గైడ్ బండ్, కాలిని రిటైనింగ్ వాల్‌ను పరిశీలించారు. రిటైనింగ్ వాల్ కూలిపోవడం వలన గైడ్ బండ్ కుంగిందని తన అభిప్రాయాన్ని ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా రిటైనింగ్ వాల్ కూలడానికి, గైడ్ బండ్ కుంగడానికి సాంకేతిక కారణాలను, సంబంధిత వివరాలను, మ్యాప్ పాయింటింగ్ ద్వారా మంత్రి అంబటికి ఎస్‌ఇ నరసింహమూర్తి, సిఇ సుధాకర్‌బాబు వివరించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. గైడ్‌బండ్ కుంగడం పెద్ద ఆటంకమని, కొన్ని పేపర్లు, ఛానల్స్ గోరంతను కొండంతలా చేసి భారీ నష్టమని, ప్రమాదకరమని పెద్దఎత్తున ప్రచారాలు చేయడం దారుణం, దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం పవిత్రమైన ప్రాజెక్ట్ అని ఏది జరిగినా వేయి కళ్లతో పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు చేస్తామన్నారు. రాజమండ్రిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీని ఈనెల 15వ తేదీన కలిసి సంబంధిత వివరాలు తెలుసుకున్నామన్నారు. గైడ్‌బండ్ కుంగిన ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించామని, ఇది ప్రాజెక్టు స్ట్రక్చర్‌లో లేని అంశమని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో స్పిల్‌వే గైడ్ బండ్ నిర్మాణం జరగాలని కేంద్ర జలశక్తి శాఖ, జలవనరులశాఖ అధికారులు ఇచ్చిన సూచనల మేరకు గైడ్‌బండ్ నిర్మాణం జరిగిందని, నిర్మాణంలో గుత్తేదారుల అలసత్వమో, లేక డిజైన్‌లో లోపమో, ప్రకృతి వైపరీత్యమో గైడ్‌బండ్ కుంగిందని, నిజనిర్ధారణ కమిటీ ఛైర్మన్ పాండ్యా సూచనల మేరకు ప్రస్తుతం గైడ్‌బండ్‌కి తాత్కాలిక మరమ్మతులు చేయనున్నామని, వరదల సీజన్ అనంతరం పూర్తిస్థాయి రక్షణ చర్యలు చేపడతామని వివరించారు. ఎగువ దిగువ కాపర్ డ్యాములు నిర్మాణం పూర్తికాకుండా డయాఫ్రంవాల్ నిర్మించడం వల్ల వరదలకు కొట్టుకుపోయిందని, రూ.2020 కోట్లు అదనపు వ్యయం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, భారీ అగాధాలు ఏర్పడ్డాయని, అగాధాలు పూడ్చడానికి 44 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమని, ఇప్పటివరకు 40 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను సమీకరించామని చెప్పారు. మరో నాలుగు లక్షల క్యూబిక్ మీటర్లు చేర్చాల్సి ఉందన్నారు. ఇంత భారీ తప్పిదాన్ని నష్టాన్ని ప్రతిపక్ష పత్రికలు ప్రచారం చేయలేదని వారికి ఈ తప్పిదాలు కనిపించలేదా అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో డయాఫ్రం వాల్ అతికీలకమని దీని పునరుద్ధరణ పనులు ఒక్క ఖావర్ కంపెనీ మాత్రమే చేయగలదని ఆ కంపెనీతో డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేసి ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యాం నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఎగువ కాపర్ డ్యాం నిర్మాణాన్ని అర్ధాంతరంగా వదిలివేయడం వల్ల భారీ నష్టం జరిగిందని, ఎగువ కాపర్‌డ్యామ్‌ని మరో రెండు మీటర్లు ఎత్తు పెంచి భారీ వరదల నుంచి కాపాడామని చెప్పారు. ఎగువ, దిగువ కాపర్ డ్యాములు తాత్కాలికమైనవని ఐదేళ్ల కాల పరిమితికి మాత్రమే నిర్మించడం జరిగిందని, వాటి నుండి సీపేజ్ రావడం వలన ఎలాంటి నష్టం లేదని, ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యాం నిర్మాణం తర్వాత వాటిని తొలగించడం జరుగుతుందని అంబటి చెప్పారు.

బాధితులకు సత్వర న్యాయం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో ఛార్జిషీట్‌ను త్వరితగతిన ముగించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని గౌతమి సమావేశపు హాలులో శుక్రవారం సాయంత్రం ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఛార్జిషీట్‌ను జాప్యం లేకుండా వెంటనే దాఖలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు, అప్పుడే బాధితులకు సత్వరం న్యాయం చేకూరుతుందన్నారు. జిల్లాలో గత అక్టోబర్ నుంచి ఇప్పటివరకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద 115 కేసులు నమోదయ్యాయని, వీటిలో ఆరు హత్యకు సంబంధించి, అత్యాచారానికి సంబంధించి ఒకటి, ఇతర కేసులు 108 నమోదయ్యాయని, వీటిలో 111 కేసులకు సంబంధించి బాధితులకు ఎఫ్‌ఆర్ స్థాయిలో రూ.74.40 లక్షలు, ఛార్జిషీట్ స్థాయిలో 31 మంది బాధితులకు రూ.34,62,500 అందించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం గురించి అవగాహన కలిగించేందుకు పోస్టర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్‌పి మేరీ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులకు సంబంధించి ప్రాధాన్యత ఇచ్చి విచారణ చేసి, ఛార్జిషీట్ దాఖలు చేస్తున్నామన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిటీ సభ్యులు మేతర అజయ్‌బాబు, ప్రవల్లిక, డాక్టర్ బి.రాంబాబు, జి.మోహన్‌రావు, జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు ఆర్థిక సహాయం సత్వరం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సివిల్ రైట్స్‌డేను అన్ని మండలాల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, అన్ని గ్రామ, వార్డ్ సచివాలయాల్లో ఎస్‌టి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం గురించి అవగాహన కలిగించేందుకు ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్ఒ ఎవిఎస్ఎస్.మూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయ్ ప్రకాష్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఆర్‌డిఒలు పెంచల కిషోర్, ఝాన్సీరాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎవిఆర్ మోహన్, డిఎస్‌పిలు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల 'పోరుకేక'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కుక్కునూరు

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకూ నెల్లిపాక నుండి విజయవాడ వరకూ నిర్వహిస్తున్న పోరుకేక పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. శుక్రవారం దామరచర్లలో పోలవరం నిర్వాసితుల పోరుకేక మహాపాదయాత్ర గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం అల్లూరి జిల్లా నెల్లిపాక నుండి విజయవాడ 400 కిలోమీటర్ల పైగా చేపడుతున్న సుదీర్ఘ పాదయాత్ర నిర్వాసితులతో కలిసి నిర్వహిస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని, గోదావరి వరదల నుండి నిర్వాసితులను రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయ చర్యలు చేపట్టాలన్నారు. అసెంబ్లీ సాక్షిగా సిఎం జగన్ ఇచ్చిన హామీలను ప్రతి నిర్వాసిత కుటుంబానికి కాంటూరుతో సంబంధం లేకుండా రూ.10.50 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, వివాహమైన ఆడపిల్లలకూ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. నిర్వాసితులను తరలించిన ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి యువతను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మహాపాదయాత్రకు అందరూ సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 26న జిల్లాలోని రుద్రంకోటకు పాదయాత్ర వస్తుందని కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మీదుగా విజయవాడకు యాత్ర వెళుతుందన్నారు. సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల, పోడు భూముల హక్కు పట్టాల కోసం ఎల్‌టిఆర్ 1/70 చట్టం భూములను సాగుచేస్తున్న గిరిజనులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ మరో పాదయాత్ర పోలవరం నుంచి బుట్టాయగూడెం చేరుకుంటుందని ఆయన తెలిపారు.

గోదావరి వరదల వల్ల దెబ్బతిన్న ఇళ్లకు పూర్తి పరిహారం ఇవ్వాలని, మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని పరిహారం ఇవ్వాలని నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం జరిగే మహాపాదయాత్రల విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, మేడిపల్లి బాబు, భయ్యాన శ్రీను, రామల్ల గాంధీ, గోలి ఇస్మాయిల్ పాల్గొన్నారు.

'ఉపాధి'ని దూరం చేసేందుకు కుట్ర : వ్యకాస

ప్రజాశక్తి - పెదపాడు

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పి.రామకృష్ణ

ఉపాధి హామీ చట్టాన్ని దశలవారీగా పేదలకు దూరం చేసేందుకు బిజెపి కుట్ర పన్నిందని, ఈ క్రమంలోనే రకరకాల నిబంధనలతో వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం మండలంలోని నాయుడుగూడెం సత్యవోలు, కొత్తూరు, సత్యనారాయణపురం తదితర గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టానికి ఉరి బిగిసిందన్నారు. ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటోల పద్ధతిని తీసుకొచ్చి తప్పనిసరిగా రెండు రకాల ఫొటోలు తీయాలని మేట్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. వెబ్‌సైట్ సరిగా పని చేయకపోయినా ఆన్‌లైన్‌లో మస్తర్ పడకపోయినా కూలీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో సిస్టం ద్వారా పేదలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. దీనివల్ల ఫీల్డ్ అసిస్టెంట్లు, సైట్ సూపర్‌వైజర్లు కూలీలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఈ జిల్లాలో అనేక మండలాల్లో కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. తాగునీరు, మజ్జిగ కూలీలే తెచ్చుకుంటున్నారని తెలిపారు. మెడికల్ కిట్లు, టెంట్లు వంటి సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల 43 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని తెలిపారు. కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో ఉపాధి సిబ్బంది వైఫల్యం చెందారని విమర్శించారు. ఇప్పటికే గత ఐదేళ్ల నుంచి పనిముట్లు ఇవ్వకుండా ఆపేశారని, వీటికి తోడు మోడీ సమ్మర్ అలవెన్స్, మేట్లకు పారితోషికం, రవాణా ఛార్జీలు, పే స్లిప్పులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. పెదపాడు మండలంలో కూలీలు కష్టపడి పనిచేసిన నాలుగు వారాల నుండి కూలి డబ్బులు పడక నానా అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. వేతనాలిచ్చే విషయంలో కూడా బిజెపి ప్రభుత్వం అనేక అవకతవకలు చేస్తుందన్నారు. ఎంపిడిఒల కనుసన్నల్లోనే కొన్ని గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాలలో మట్టి అక్రమ రవాణా కూడా జరుగుతుందన్నారు. దీనిపై జిల్లా ఉన్నతస్థాయి అధికారులు వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూలీలపై ఉందని తెలిపారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, కరిముల్లా, సునీత పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి - భీమడోలు

దీర్ఘకాలంగా పరిష్కారం కాని విద్యుత్ సమస్యలతో విసుగుచెందిన భీమడోలు ప్రజలు శుక్రవారం రోడ్డెక్కారు. సూరప్పగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. భీమడోలు గ్రామంలోని పలు ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్య, విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విషయమై ప్రజలు పలుపర్యాయాలు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. ఇదే క్రమంలో గురువారం రాత్రి నుంచి అప్పక వారివీధి, వెలమపేటతో పాటు పలు ఇతర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం ఉదయం అక్కడికి చేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు ఆ రెండు ప్రాంతాల్లో గల 100 కిలోవాట్ల సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సాంకేతిక లోపాలతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తేల్చారు. మరమ్మతు పనులు మొదలు పెట్టారు. ఈ దశలో గంటల సమయం గడిచిన మరమ్మతులు పూర్తి కాలేదు. దీంతో విసుగుచెందిన ప్రజలు ఆ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న దానికన్నా అధిక సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి తమ విద్యుత్ సమస్యలు తీర్చాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు ఆ ప్రాంతంలో 160 కెవి సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించినప్పటికీ శివారు ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్య యథాతథంగా ఉంటుందని తేల్చారు. ఒకవేళ ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న ప్రాంతానికి దూరంగా మరోచోట సమస్య పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు తామ సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆ ప్రాంతాల వారు తమ ఇళ్లకు ఎదురుగా నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అంగీకరించడం లేదని అధికారులు తెలిపారు. ఈ మేరకు ప్రజలు, విద్యుత్ శాఖ అధికారుల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఇదే విషయమై ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనేక తర్జన, భర్జనల అనంతరం విద్యుత్ శాఖ అధికారులు సమస్య పరిష్కారానికి తాత్కాలిక మార్గాన్ని సూచించారు. ఆ రెండు ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారంతోపాటు విద్యుత్ కోతలు నివారించేందుకు 40 కెవి సామర్థ్యం గల రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

వీటి ఏర్పాటు శనివారం సాయంత్రానికి పూర్తవుతుందని విద్యుత్ శాఖ భీమడోలు ఎఇ రామస్వామి తెలిపారు. అప్పటి వరకూ మరమ్మతులు చేసిన ప్రస్తుత ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. 100 కెవి సామర్థ్యం గల అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రజలు స్థలాన్ని సూచిస్తే ఆ ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

యువకుని కిడ్నాప్, ఆపై దాడి

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అర్ధరాత్రి అందరు చూస్తూ ఉండగా ప్రజలు పెద్ద మొత్తంలో తిరిగే ప్రాంతం.. అదిగాక పూర్తిస్థాయిలో మెగా కెమెరాలతో ఉండే ప్రాంతంలో ఒక వ్యక్తి తన అనుచరులతో కలిసి మరో వ్యక్తిని కిడ్నాప్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దీనికి కారకులైన వారిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు మాదేపల్లికి చెందిన వాలిపోయిన నవహర్ష గురువారం అర్ధరాత్రి ఓ జీపులో తన అనుచరులు ఏడుగురితో కలిసి స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోకి వచ్చాడు. అక్కడ జీపు నిలుపుదల చేసి అంతా ఆసుపత్రిలోకి వచ్చారు. అక్కడ పనిచేస్తున్న పంచెకర గ్రీష్మను కలిసేందుకు వచ్చిన పుట్టి చంద్రశేఖర్ అనే యువకుడిని వీరంతా చుట్టుముట్టారు. బలవంతంగా అతన్ని కొట్టుకుంటూ లాక్కెల్లి అందరూ చూస్తుండగానే కారులోకి నెట్టి నగర శివారు పోణంగిలోని ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. గ్రీష్మను కలిసేందుకు రావొద్దంటే ఎందుకు వస్తున్నావని, మళ్లీ వస్తే చంపేస్తామని బెదిరించారు. అక్కడంతా కలిసి చంద్రశేఖర్‌ను విచక్షణారహితంగా కొట్టారు. ఖాళీ ప్రామిసరీ నోట్లపై, కొన్ని డాక్కుమెంట్లపై చంద్రశేఖర్‌తో బలవంతంగా సంతకాలు చేయించుకుని మళ్లీ గ్రీష్మను కలిస్తే చంపేస్తామని బెదిరించి అతన్ని వదిలేసి వెళ్లిపోయారు.

పోలీసులను అశ్రయించిన బాధితుడు

బాధితుడు టూటౌన్ పోలీసులను ఆశ్రయించగా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు డిఎస్‌పి శ్రీనివాసులు పర్యవేక్షణలో సిఐ చంద్రశేఖరరావు కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు ఎస్‌ఐ ప్రసాద్, సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శుక్రవారం వారిని ఆనెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బాలిబోయిన నవహర్షతో పాటు అతని అనుచరులైన ఏలూరు అముదాల అప్పలస్వామి కాలనీకి చెందిన పద్మారావు, షరుణ్ కుమార్, కొత్తవీధికి చెందిన ప్రసాద్ కుమార్, పోణంగికి చెందిన మహ్మద్ బాషా, వంగాయగూడానికి చెందిన సురేష్, కేశవ, అఖిల్‌లను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు.

పుట్టి చంద్రశేఖర్ చేబ్రోలు రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌గా పని చేస్తున్నాడు. అతనికి గతంలో వివాహమైంది. రెండేళ్ల క్రితం భార్య చనిపోవటంతో పంచకర్ల గ్రీష్మను రెండో వివాహం చేసుకున్నాడు. కాగా కొంతకాలంగా వీరిద్దరి మధ్య సఖ్యత కొరవడింది. గ్రీష్మ ప్రస్తుతం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నట్లు చెబుతున్నారు. గ్రీష్మ, చంద్రశేఖర్ ఎవరికి వారు విడివిడిగానే ఉంటున్నారు. ఈ క్రమంలో గ్రీష్మకు నవహర్ష పరిచయమయ్యాడు. గ్రీష్మ కోసం చంద్రశేఖర్ అప్పుడప్పుడూ ఆసుపత్రికి వస్తున్నాడు. ఇది ఆమెకు ఇష్టంలేదు. చంద్రశేఖర్‌ను రాకుండా చేయాలని నవహర్షకు ఆమె చెప్పటంతో పతకం ప్రకారం హర్ష అతను వచ్చిన విషయాన్ని తెలుసుకుని తన అనుచరులతో వచ్చి కిడ్నాప్ చేసినట్లు తెలిపారు.

'ప్రజాశక్తి' కథనంతో ఉలిక్కిపడ్డ అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజాశక్తి కథనంతో మండలస్థాయి అధికారులు ఉలిక్కి పడ్డారు. మళ్లీ తవ్వకాల జాతర అనే శీర్షికతో శుక్రవారం ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీంతో రెవెన్యూ అధికారులు సదరు భూమి రైతుకు ఫోన్ చేసి "ప్రజాశక్తిలో వార్త వచ్చింది. విలేకరితో మాట్లాడుకోండంటూ" సమాచారం ఇచ్చారు. దీంతో గుడివాడ సిఎం సభలో ఉన్న సదరు పొలం రైతు బయటకు వచ్చి వెంటనే విలేకరికి ఫోన్ చేసి "అయ్యగారు ఫోన్ చేశారు. ప్రజాశక్తిలో వార్త వచ్చిందని పేపర్‌లో రాసి ఇబ్బంది పెట్టవద్దని" కోరాడు. కొద్దిసేపటికి తర్వాత చెరువులో వాటాదారుడిగా ఉన్న ఓ సీనియర్ పాత్రికేయుడు విలేకరికి ఫోన్ చేసి "నేను భూమి పుట్టిన దగ్గర నుంచి విలేకరిగా పని చేస్తున్నాను. నాకు చెరువులో వాటా ఉంది. నేను నీకు తెలియదా, నా ఫోన్ నెంబర్ నీకు తెలియదా, నా చెరువు గురించి రాస్తావా" అంటూ బెదిరింపు ధోరణికి దిగాడు. ఇక మీదట చెరువు గురించి రాయవద్దంటూ హెచ్చరించాడు. ఇదీలా ఉండగా సింగరాయపాలేనికి చెందిన ఓ చిన గుడి ఛైర్మన్ ఫోన్ చేసి "చెరువు అన్నగారిది, నీతో మాట్లాడమన్నాడు, మీరు వెంటనే మండల ఆర్ఐ గారికి ఫోన్ చేసి మాట్లాడండి" అంటూ ఫోన్ పెట్టేశారు. ఈ విధంగా మళ్లీ తవ్వకాలు జాతర అనే శీర్షికతో వచ్చిన వార్తపై విలేకరికి ఫోన్ కాల్స్ వచ్చాయి. బడాబాబులు అనుమతులు గోరంత చూపించి కొండంతా తవ్వకాలు చేస్తున్నారు. దళితులు మాత్రం చెరువులు తవ్వితే ఊరుకునేది లేదంటూన్నారు. అభ్యంతరాలు ఉన్నా వాటిని లెక్కచేయకుండా తవ్వకాలు చేస్తున్నారు. దళితవాడలను ఆనుకుని చెరువులు తవ్వకాలు చేస్తున్నారు. తవ్వకాల విషయమై మండల ఆర్ఐని వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. అక్రమ చెరువుల తవ్వకాలు, అక్రమ మట్టి తోలకాల విషయంలో పార్టీలకు అతీతంగా అంతా కలిసి పనులు చేసుకుంటూ రూ.లక్షలు గడిస్తున్నారు.

27 నుంచి జగనన్న సురక్ష పరిష్కార వేదిక

భీమడోలు మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఎవి.గంగాధరరావు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిధిలో ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించే జగనన్న సురక్ష పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఎవి.గంగాధరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నెలవారి సమీక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి అధ్యక్షత వహించగా కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 24వ తేదీన ప్రారంభం అవుతుందన్నారు. మండల పరిధిలోని 17 గ్రామ సచివాలయాల వద్ద సదరు కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. మండల పరిధిలో అమలవుతున్న కొన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు కాగితాలపై ఘనంగా ఉంటున్నాయని, క్షేత్రస్థాయిలో భిన్నంగా ఉంటున్నాయని, వీటిని సరిచేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. మండల పరిధిలోని కౌలు రైతు 3600 పంట సాగు హక్కు పత్రాల పంపిణీ లక్ష్యం కాగా ఇప్పటివరకు 389 పత్రాలు లబ్ధిదారులకు చేరాయని, వాటిని వేగవంతం చేయాల్సి ఉందని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థలో ఆసక్తి గలవారు స్వచ్ఛందంగా చేరవచ్చని తెలిపారు.

మండల పరిధిలో వివిధ పథకాల కింద 62 ప్రాధాన్యత భవనాల నిర్మాణాలకు రూ.15.5 కోట్లు మంజూరు కాగా ఇప్పటివరకు రూ.7.17 కోట్లు బిల్లుల చెల్లింపు జరిగిందన్నారు. ఇసుక కొరత కారణంగా మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో గృహ నిర్మాణాలు నిలిచిపోయినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సమస్య పరిష్కారానికి చేబ్రోలు స్టాక్ పాయింట్ వద్ద ఇసుకను నిల్వ చేసి సోమవారం నుంచి గృహ నిర్మాణాలు అధికారులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. గృహ నిర్మాణ సంస్థ డిఇ సోమేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలోని 28 జగనన్న కాలనీల్లో 2086 గృహ నిర్మాణాలకు అనుమతులు లభించాయన్నారు. గృహ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టే పరిస్థితిలో లేకుంటే ప్రభుత్వమే సదరు గహాల నిర్మాణ బాధ్యత చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహశీల్దార్ ఇందిర గాంధీతో పాటు పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి - చింతలపూడి

వికలాంగులు వారికి అవసరమైన పరికరాలను తీసుకుని ఉపయోగించుకోవాలని ఎంపిడిఒ ఎం.మురళీకృష్ణ తెలిపారు. జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం వారు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం వికలాంగుల గుర్తింపు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మురళీకృష్ణ మాట్లాడుతూ పరికరాలను ఉపయోగించుకుని వికలాంగులు వారి జీవితంలో ముందుకు వెళ్లాలన్నారు. జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం ద్వారా ఆడియోలజీ, సైకాలజీ, ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వికలాంగులు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.కామేశ్వరి, జిల్లా వికలాంగుల పునరావాస కేంద్ర సిబ్బంది జి.రాంబాబు, కె.నాగరాజు, కంబయ్య, జయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మండిచిటిలో పెరిగే డెంగీ, మలేరియా దోమలు చాలా ప్రమాదకరమని, వాటిని నిర్మూలించాలంటే ప్రజలు భాగస్వాములు కావాలని మెతేవారితోట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దివ్యశ్రీయ సుజన సూచించారు. ఎక్కువ రోజులు మంచి నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమలు సమాజానికి చాలా హానికరమని, డ్రై డే కార్యక్రమంగా నిర్వహించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. స్థానిక మెతేవారితోటలో జరుగుతున్న డ్రై డే కార్యక్రమంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల నిర్మూలనలో, దోమల ద్వారా వచ్చే డెంగి, మలేరియా, చికెన్‌గున్యాలను అరికట్టడంలో తమ వంతు పాత్ర పోషించాలని ప్రజలకు సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ దోమ కాటు చిన్నదైనప్పటికీ దానివల్ల వచ్చే ముప్పు చాలా ప్రమాదకరమన్నారు. దోమ కాటు నుంచి సంరక్షించుకోవాలన్నారు. ర్యాలీ నిర్వహించి ఇంటింటా కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, రమేష్, నిర్మల, సునీత, ఆశా కార్యకర్తలు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు శ్రావణి ఎంపిక

ప్రజాశక్తి - ముదినేపల్లి

శ్రావణి

ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బడుగు శ్రావణి కైకలూరు నియోజకవర్గస్థాయి జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కుమారి ఎం.జాస్మిన్ శుక్రవారం తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో హెచ్ఇసి గ్రూపులో 839 మార్కులు సాధించి నియోజకవర్గస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రథమ విద్యార్థినిగా శ్రావణి నిలిచారన్నారు. ఈ నెల 17న కైకలూరులో జరిగే కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు శ్రావణికి అవార్డుగా రూ.15 వేల నగదు, ప్రశంసాపత్రంతో పాటు ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తారన్నారు. ఈ సందర్భంగా అవార్డుకు ఎంపికైన శ్రావణిని ప్రిన్సిపల్‌తో పాటు చరిత్ర అధ్యాపకురాలు ఆర్.జానకిదేవి, అధ్యాపకులు, ఇతర సిబ్బంది అభినందించారు.



మాగంటిబాబును పరామర్శిస్తున్న టిడిపి మండల నాయకులు

మాగంటి బాబుకు టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన చంద్రబాబు పర్యటనలో మాజీ ఎంపి మాగంటి వెంకటేశ్వరరావు(బాబు) పాల్గొనగా ఆయన కాలికి గాయమైంది. హైదరాబాద్‌లో చికిత్స పొంది ఏలూరుకు వచ్చిన ఆయనను టిడిపి మండల నాయకులు ఏలూరులోని ఆయన స్వగృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పరామర్శించారు. పరామర్శించినవారిలో టిడిపి నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు, నక్కనబోయిన వేణు, కోసూరి సుబ్బరాజు, దొండపాలి ఏసుపాదం, జమ్ముల సురేష్, వీరాబత్తి జోజిబాబు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తెలంగాణ మద్యం, నాటుసారా పట్టివేత
ముగ్గురి అరెస్ట్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు నూజివీడు సర్కిల్ పరిధిలోని ఆగిరిపల్లి, సగ్గూరు గ్రామాల్లో జిల్లా టాస్క్ ఫోర్స్ జరిపిన దాడుల్లో 81 మద్యం మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ పి.గోపాలకృష్ణ తెలిపారు. ఆగిరిపల్లిలో వాకా రంగారావు ఇంటిలో 81 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని రంగారావుతో పాటు పరసా ప్రసాదరావును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మద్యాన్ని సరఫరా చేసిన దాసరి వినోద్‌పై కూడా కేసు నమోదు చేశామన్నారు. సగ్గూరు గ్రామంలో చంగల సింగయ్య వద్ద ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అరెస్టు చేసిన ముగ్గురు వ్యక్తులను జ్యుడిషియల్ రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణధనరాజ్, ఎస్ఐ అల్లూరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

450 కేజీల జీలుగు విత్తనాలు స్వాధీనం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెంలో కొనకళ్ల పవన్‌కుమార్‌కు చెందిన సత్య ఎంటర్ ప్రైజెస్ గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన 450 కేజీల జీలుగు విత్తనాలు సీజ్ చేసి షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్, సిబ్బంది నిర్వహించిన దాడుల్లో బొర్రంపాలెంలో కొనకళ్ల పవన్ కుమార్‌కు చెందిన గోదాములో రూ.13,500 విలువైన జీలుగు విత్తనాలు అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామని తెలిపారు. షాపు యజమానిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎటువంటి అనుమతులు లేని విత్తనాలు, ఎరువులు విక్రయించినా, అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు.

లారీ ఇంజన్‌లో మంటలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలో ఆగి ఉన్న లారీలోంచి మంటలు వచ్చాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వరుణుడి కోసం రైతులు ఎదురుచూపు

కాల్వలకు చేరని నీరు
ఖరీఫ్ ఆలస్యమయ్యే పరిస్థితి

పోల్‌రాజ్ ప్రధాన కాల్వ

ప్రజాశక్తి - ముదినేపల్లి

జూన్ ప్రారంభమై రెండు వారాలు గడిచినా వరుణుడి జాడ లేకపోవడంతో రైతులు నారుమడులు వేసేందుకు అవకాశం లేకుండాపోయింది. వెదజల్లిన చేల్లో విత్తనాలు అధిక ఉష్ణోగ్రతలకు మాడిపోతున్నాయి. దీంతో ఈసారి ఖరీఫ్ ఆలస్యమయ్యే అవకాశం మండలంలో కన్పిస్తోంది. రైతులు వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. ఆకాశంలో దట్టంగా మేఘాలు అలుముకుంటున్నా తేలిపోతున్నాయి. చినుకుపడితే విత్తనాలు చల్లుకునేందుకు వీలుగా నారుమడులు సిద్ధం చేసుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కాని వరుణుడు మాత్రం కరుణించడంలేదు. దీంతో రైతుల ఆశలు నిరాశలుగా మారుతున్నాయి. ఎండల తీవ్రత ఇంకా కొనసాగుతుండడం, వర్షాలు కురవకపోవడంతో మండలంలో ఖరీఫ్ సాగు ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే మండలంలో పలు గ్రామాల్లో రైతులు విత్తనాలు వెదజల్లారు. ఆ వర్షాలు రాకపోగా ఎండలు దంచి కొట్టడంతో ఉష్ణోగ్రతలకు విత్తనాలు మాడిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 11వ తేదీ ఆదివారం రాత్రి మండలంలో పలు గ్రామాల్లో దుక్కిపాటి వర్షం కురిసింది. దీంతో వెదజల్లిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు వర్షం జాడ లేకపోవడంతో వెదజల్లిన చేల్లో మొలక వచ్చిన విత్తనాలు ఎండలకు మాడిపోతున్నాయి. ముదినేపల్లి, పెయ్యేరు, దాకరం, కానుకొల్లు, వడాలి గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. దీంతో రైతులు తమ కళ్ల ముందే ఎండలకు పూత రాలిపోవడంతో మళ్లీ మరోమారు విత్తనాలు వెదజల్లే పరిస్థితి ఉందంటున్నారు. మండలంలో ప్రధాన కాల్వలకు చుక్క నీరు రాలేదు. ఈ నెల ఏడో తేదీన విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి అట్టహాసంగా డెల్టాకు నీరు విడుదల చేశారు కాని మండలానికి నేటికీ చుక్క నీరు చేరలేదు. రెండు రోజుల పాటు గుడ్లవల్లేరు లాకుల వద్ద నిల్వ ఉన్న పసర్ల నీరు మాత్రం కాల్వలకు వదిలారు. గురువారం అది కూడా ఆగిపోయింది. దీంతో వర్షాలు కురిస్తే తప్ప ఖరీఫ్ సాగు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. ఈ నెల 19వ తేదీ నాటికి పోల్‌రాజ్ కెనాల్‌కు 350 క్యూసెక్కులు నీరు తక్కువ కాకుండా విడుదల చేయాలంటూ మండల జలవనరుల శాఖ అధికారులు ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టినట్లు చెబుతున్నారు. కాల్వలకు ఇప్పట్లో నీరు వచ్చే అవకాశాలు కనబడటంలేదు. మరో పదిరోజుల వరకు పూర్తిస్థాయిలో కాల్వలకు నీరు వచ్చే పరిస్థితి లేదు. దీంతో రైతాంగం వరుణుడి కరుణ కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. వరుణుడి కరుణిస్తే తప్ప ఖరీఫ్ నీటి కష్టాలు తీరేలా లేవు.

గురుకులం సేవలను విద్యార్థినులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

పొలసానిపల్లి కేంద్రంగా పనిచేస్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం (బాలికలు) సేవలను విద్యార్థినులు వినియోగించుకోవాలని సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. స్థానిక గురుకులంలో 2022 -23 విద్యా సంవత్సరానికి నిర్వహించిన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులను గురుకులం స్థాయిలో జగనన్న ఆణిముత్యాలుగా గుర్తించారు. గురుకులంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచి ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందించారు. వారు మరింత విద్యావంతులుగా మారాలని, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మావతి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక ఉప్పలమెట్ట అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. తొలుత ఇన్‌ఛార్జి డిసిఒ ఎన్.భారతి, ప్రిన్సిపల్ పి.అరుణ, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పుష్పాలను సమర్పించారు. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ ర్యాంకులు సాధించిన డి.అనుశ్రీ (మొదటి స్థానం), ఇందుప్రియ (రెండో స్థానం), రిషిత (మూడో స్థానం) విద్యార్థులను ఇన్‌ఛార్జి డిసిఒ ఎన్.భారతి, విద్యా కమిటీ వారు ప్రిన్సిపల్ పి.అరుణ, ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి డిసిఒ ఎన్.భారతి మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులందరూ క్రమశిక్షణ కలిగి ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులై మొదటి, రెండు, మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను సన్మానించడం సంతోషమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్, గురుకుల పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న పొలసానిపల్లి సర్పంచి హసేన

19న ఆలయ భూముల కౌలుకు వేలం

ప్రజాశక్తి - ముసునూరు

బలివే గ్రామ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ భూముల వేలంపాటలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ అధికారి ఆకుల కొండలరావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆలయ భూములు ఆర్ఎస్ నెంబర్ 118లో య 8-78 సెంట్ల భూమి, వేల్పుచర్ల గ్రామంలో ఆర్ఎస్ నెంబర్ 376లో య 1-16 సెంట్ల భూమి మూడేళ్ల కాలపరిమితి కౌలుకు వేలం పాట ఈ నెల 19వ తేదీన ఆలయ ప్రాంగణం వద్ద దేవదాయ ధర్మదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు హుండీ లెక్కించాలని నిర్ణయించినట్లు ఆలయ ఇఒ తెలిపారు.



పంటకాలువను పరిశీలిస్తున్న అధికారులు

పంటకాలువ పరిశీలన

ప్రజాశక్తి - ముదినేపల్లి

గత 40 ఏళ్లుగా పరిష్కారం కాని ప్రభుత్వ రికార్డుల్లో లేని పంటకాలువను శుక్రవారం జలవనరుల శాఖ అధికారులు పరిశీలించారు. మండలంలోని చేవూరు శివారులో ప్రభుత్వ రికార్డుల్లో లేని పంటకాల్వ భూమిని ప్రభుత్వ రికార్డుల్లో చేర్చాలంటూ గతంలో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు దృష్టికి రైతులు తీసుకువెళ్లి పరిష్కరించాలంటూ వినతి పత్రం అందించారు. ఎంఎల్‌ఎ డిఎన్ఆర్, జలవనరుల శాఖ ఎస్ఇ ఆదేశాలు మేరకు ఆ శాఖ డిఇ జి.గణేష్‌బాబు జెఇ సిద్దార్థ, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణతో కలిసి పంకాలువ భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రంగిశెట్టి కొండ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మహిళలకు దిశా యాప్ రక్షణ కవచం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

దిశా యాప్ మహిళల పట్ల రక్షణ కవచమని, ప్రతి మహిళ తమ ఫోన్‌లో దిశాయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆగిరిపల్లి ఎస్ఐ ఎస్.చంటిబాబు అన్నారు. దిశా యాప్ ఆవశ్యకత, మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయడం గురించి మోహన్ స్పిన్‌టెక్, ఎన్ఆర్ఐ కళాశాల, మండల వనరులు కేంద్రం, కళాశాల బస్సుల్లో ప్రయాణించే విద్యార్థినులకు, పలు గ్రామాల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మహిళా సంరక్షణాధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి చేకూరాలి

ప్రజాశక్తి - ముసునూరు

వైసిపి అధికారంలోకొచ్చిన తర్వాత నిర్మించిన ప్రతి ఇంటికి లబ్ధి చేకూరాలని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి, డిఎంహెచ్ఒ మండల ప్రత్యేక అధికారి ఆశ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ సచివాలయ అసిస్టెంట్, గ్రేడ్-5 కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు ఎం.నాగమల్లేశ్వరావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎంపిడిఒ జి.రాణి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం కింద ఈ నెల 23వ తేదీ నుంచి జులై 30వ తేదీ వరకు జరిగే గ్రామసభలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా వాలంటీర్లు తమకు కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందరికి అందుతున్నాయా లేదా అని అడిగి వారి నుంచి ఏవైనా అర్జీలు వచ్చినట్లయితే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వాలంటీర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి-2 గంగాధరరావు, తహశీల్దార్ దాసరి సుధ, హౌసింగ్ ఇఇ శ్రీదేవి, బిడి ఇ రంగారావు, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి, ఎంపిడిఒ

వీధిలైట్లు ఏర్పాటు చేయరూ..!

ముక్కంపాడు గ్రామస్తుల ఆవేదన
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రామంలో వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండలంలోని ముక్కంపాడు గ్రామస్తులు వాపోతున్నారు. ఏ చిన్న వస్తువు కావాలన్న కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రగడవరానికి వెళ్లాల్సి ఉంటుందని, రాత్రి సమయంలో ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషసర్పాలు రోడ్డుపైకి రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో పాదచారులు పాముకాటుకు గురై ప్రాణాపాయస్థితి నుంచి బయటపడిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. రాత్రి సమయంలో విషసర్పాలు ఎక్కువగా సంచరిస్తున్నాయని, వీధి లైట్లు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదంలో జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో సుమారు పది లైట్లు అవసరమవుతాయని, విద్యుత్ స్తంభాలు కూడా రోడ్డు పక్కనే ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సిఎం సభతో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రయాణికుల తిప్పలు

ముదినేపల్లిలో వాహనాలను మళ్లిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం గుడివాడ పర్యటన సందర్భంగా పోలీసులు విధించిన ట్రాఫిక్ ఆంక్షలతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. ముఖ్యమంత్రి సభ గుడివాడ రూరల్ మండలం మల్లాయపాలెం సమీపంలో జరగనుంది. సభ మార్గం ముదినేపల్లి-గుడివాడ రహదారిలో ఉండడంతో ఉదయం ఆరు గంటల నుంచే పోలీసులు ముదినేపల్లి-గుడివాడ రహదారిని బంద్ చేశారు. దీంతో గుడివాడ, విజయవాడ వెళ్లే వాహనాలను గుడ్లవల్లేరు మీదుగా మళ్లించారు. స్థానిక గురజ సెంటర్, వైకుడలి వద్ద పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనదారులను గుడివాడ వైపు వెళ్లనీయకుండా చర్యలు చేపట్టారు. గుడివాడ నుంచి భీమవరం, కైకలూరు, బంటుమిల్లి వెళ్లే వాహనాలను గుడ్లవల్లేరు మీదుగా ముదినేపల్లి మళ్లించారు. మచిలీపట్నం నుంచి నూజీవీడు వెళ్లే వాహనాలను మండవల్లి మండలం కానుకొల్లు అడ్డరోడ్డు, పుట్లచెరువు నాగవరప్పాడు మీదుగా నూజివీడు మళ్లించారు. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. అధిక ప్రయాసతో పాటు ఆదనపు బస్సు ఛార్జీలు చెల్లించుకోవాల్సి రావడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

లక్కవరంలో యువకుని అదృశ్య కలకలం

ఎర్రకాలువ గట్టున కనిపించిన గుర్తులు - విచారణ చేపడుతున్న పోలీసులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దుర్గారెడ్డి (ఫైల్)

మండలంలోని లక్కవరంలో పెళ్లయిన యువకుడు అదృశ్యమైన సంఘటన కలకలం సృష్టించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు రోజంతా గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆ గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్కవరం గ్రామానికి చెందిన దల్లి దుర్గారెడ్డి కౌలు వ్యవసాయం చేస్తున్నాడు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆచూకీ తెలియడం లేదని కుటుంబ సభ్యులు ద్వారా అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. లక్కవరం గ్రామ సమీపంలో ఎర్రకాలువ గట్టు వద్ద దుర్గారెడ్డి ద్విచక్రవాహనం, చెప్పులు కనిపించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. డిఎస్‌పి ధనుంజయ్ పర్యవేక్షణలో లక్కవరం ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు దుర్గారెడ్డి ఆనవాళ్లు కనిపించిన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో కాలువలో గాలింపు చేపట్టారు. అయినప్పటికీ దుర్గారెడ్డి ఆచూకీ తెలియకపోవడంతో పలు కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు డిఎస్‌పి తెలిపారు. దుర్గారెడ్డి భార్య అనురాధ చెప్పిన వివరాల ప్రకారం దుర్గారెడ్డి ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం బ్యాంకు నుంచి నగదు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి జంగారెడ్డిగూడేనికి వెళ్లాడు. అనురాధ భర్తకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో సాయంత్రం వరకు ఎదురు చూశారు. దుర్గారెడ్డి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన మొదలైంది. బ్యాంకు నుంచి నగదుతో వస్తున్న దుర్గారెడ్డిపై ఎవరైనా దాడి చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. దీనికి తోడుగా దుర్గారెడ్డి ద్విచక్రవాహనం, చెప్పులు ఎర్రకాలువ గట్టుపై అనుమానాస్పదంగా కనిపించడంతో కుటుంబ సభ్యులు మరింత భయాందోళనలు వ్యక్తం చేశారు. పోలీసులుఈ కోణంలో కూడా దర్యాప్తు చేపట్టారని తెలుస్తుంది. అలాగే పోలీసుల విచారణలో జంగారెడ్డిగూడెం బ్యాంకుల నుంచి దుర్గారెడ్డి ఏవిధమైన నగదు తీసుకున్నట్లు ఆధారాలు లభించలేదని వెల్లడైంది. దీంతో లక్కవరం పోలీస్ స్టేషన్లో దుర్గారెడ్డి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారని డిఎస్‌పి ధనుంజయ తెలిపారు. విచారణ పూర్తయిన వెంటనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

శ్రీవారి సన్నిధిలో పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీ రాజీవ్‌శర్మ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామిని కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రాజీవ్ శర్మ శుక్రవారం సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ఇఒ విజయరాజు శాలువతో సత్కరించి, స్వామివారి మెమోంటో, ప్రసాదములు అందించారు.

18న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు డిఎఆర్ కళాశాలలో ఈ నెల 18వ తేదీన బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు కోచ్ అవినాష్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ అండర్ 19 కేటగిరీలో జరుగుతున్న ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల మెమో, ఈ సేవ ద్వారా జారీ చేసిన డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలిపారు.

త్రిబుల్ ఐటీలో ప్రవేశాలకు 26 వేల దరఖాస్తులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

త్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు శుక్రవారం సాయంత్రం వరకు 26 వేల దరఖాస్తులు వచ్చాయని అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య గోపాల రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు గడువు ఈ నెల 26వ తేదీతో ముగియనుందని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తు తేదీ గడువు ముగిసే లోపు 50 వేల లోపు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని గోపాల రాజు పేర్కొన్నారు.

గొల్లపల్లి ఆలయ భూములకు వేలం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని రఘునాథస్వామి ఆలయానికి చెందిన పొలసానపల్లిలో ఉన్న 3.09 ఎకరాలకు మూడేళ్ల కాలపరిమితికి శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు ఇఒ ఆకుల కొండలరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో వేలం జరిగిందన్నారు. అనంతరం స్వామివారి హుండీ కానుకలు లెక్కించినట్లు తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

కంకటాల ప్రసాద రావు, తండ్రి: సుబ్బారావు అను నేను నాయొక్క పాస్‌పోర్టు పడిపోయింది. పాత ఇంటి నుండి కొత్త ఇంటికి వెళుతుండగా నాయొక్క పాస్‌పోర్టు పడిపోయినది. **పాస్‌పోర్టు నెంబర్: L4388683** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కంకటాల ప్రసాద రావు
తండ్రి: సుబ్బారావు, డో.నెం.3-79, వెలగలేరు. పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, పిన్: 534123.
సెల్: 76809 32687

పాస్‌పోర్ట్ పోయినది

ఉంగుటూరు మండలం, రావులపర్రు గ్రామంకు చెందిన ధనుకొండ వెంకట లక్ష్మీ, భర్త: మల్లేశ్వర రావు (ఆధార్ నెంబర్ 8603 3757 6699) తెలియజేయునది ఏమనగా.., ది.09-05-2023న నా ఒరిజినల్ పాస్‌పోర్టు (నేను వైజాగ్‌లో పొందిన **(S1579658)** జిరాక్స్ కాపీలు తీసుకునే నిమిత్తం ఆటోలో మా ఇంటి నుంచి ఉంగుటూరు వెళుతుండగా నా పాస్‌పోర్టు ఇతర డాక్యుమెంట్స్ ఉన్న సంచి దారిలో పడిపోయినవి. దారి పొడవునా ఎంత వెతికినా కనిపించలేదు. నా ఒరిజినల్ పాస్‌పోర్టు ఇతర డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికితే నాకు ఈ నెంబరుకు తెలియ పరచగలరు.

ధనుకొండ వెంకట లక్ష్మీ
భర్త: మల్లేశ్వర రావు, ఫ్లాట్ నెం 313, రావులపర్రు, వెస్ట్ విపర్రు పోస్ట్, ఉంగుటూరు మండలం
సెల్: 63038 15399, 99512 90934

లింకు దస్తావేజులు పోయినవి

వల్లూరి సత్యవాణి, భర్త: ప్రకాష్ దత్ గారి ఒరిజినల్ ఇంటి లింకు దస్తావేజులు నెం. 1803/2012, 1784/2012 గల దస్తావేజులు పోయినవి. పాలంగి గ్రామంలో ఇల్లు కలదు. ఇంటి దస్తావేజులకు సంబంధించిన లింకు దస్తావేజులు 16వ తేదీన జిరాక్సు తీసుకొనుటకు వెళ్ళుచుండగా మార్గ మధ్యంలో పడిపోయినవి. చుట్టుప్రక్కల ఎంత వెతికినా దొరికలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు అందించగలరు.

పార్టీ వివరములు
డో.నెం. 20-1-57, బాయ్స్ హైస్కూల్ ఎదురుగా, తణుకు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా.

పొట్ల సురేష్
అడ్వకేట్, సెల్: 90325 73947

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సెకెండ్ ఎడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి-కం సెకెండ్ ఎడిషినల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు
ఓ.ఎస్.నెం. 543/2019

వాది: అది రఘురామ్
ప్రతివాది: సంబలదీవి సునీత

వాది తరుపున దాఖలు చేసుకున్న పేపరు ప్రకటన

పై నెంబరు గల దావాలో ప్రతివాది అయిన మీరు దావా సమన్లు శ్రీ కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా పలుమార్లు పంపిననూ అవి మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పై కోర్టు వారి ఎదుట **ది.22-06-2023వ** తేదీన **ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, మీ తరుపున ప్లీడరు గారి ద్వారా గాని హాజరై అభ్యంతరములు ఉన్న ఎడల తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున తీర్పును తీర్మానించబడును అని మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

పంతం వి.వి.సత్యనారాయణ
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 97013 55773